

నేడు సాగునీరు విడుదల

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లోని బొప్పాపూర్, సముద్రలింగాపూర్ గ్రామ శివారుల్లోని జక్కుల, సింగసముద్రం చెరువుల నుంచి బుధవారం సాగు నీటిని విడుదల చేస్తామని నీటి పారుదల శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జక్కుల చెరువు కింద బొప్పాపూర్, గొల్లపల్లి గ్రామాల్లో 494 ఎకరాల్లో ఆయకట్టు ఉండగా సాగు నీటితో 300 ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని పేర్కొన్నారు. మండల కేంద్రానికి సాగు నీటి వరప్రదాయిని అయిన సింగసముద్రం చెరువు నుంచి సాగు నీటిని విడుదల చేయడంతో 1,600 ఎకరాల్లోని వ్యవసాయ పొలాలు సాగులోకి రానున్నాయని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, నాయకులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి బాలాలయంలో ధనుర్మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా పురోహితుడు నవీన్‌చారి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు మంగళ హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందనామ స్మరణతో ఆలయం మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సాఫీగా ఇందిరమ్మ సర్వే

- మిగిలింది మరో ఐదు రోజులే
- 1,07,398 దరఖాస్తులు
- ఇప్పటి వరకు 55.70 శాతం పూర్తి
- యాప్‌లో వివరాలు నమోదు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాఫీగా సాగుతోంది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కోసం ఈ నెల 8 నుంచి క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభించారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు, మున్సిపల్ వార్డు అధికారులు సేకరించిన వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. పేదల సొంతింటి కల సాకారం చేసే దిశగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఈ నెల 31లోగా పూర్తి చేయనున్నారు. మరో ఐదు రోజులే గడువు ఉండడంతో సర్వేను మరింత ముమ్మరం చేశారు.



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

గ్రామసభల్లో అర్హుల ఎంపిక..

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకోసం ప్రజాపాలనలో 1,07,398 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అర్హతను బట్టి ఇళ్ల మంజూరు చేపట్టనున్నారు. ఇందుకోసం ప్రాధాన్య క్రమంలో కేటాయింపులు జరిగే విధంగా సర్వే చేస్తున్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు 59,822 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశారు. 55.70 శాతం సర్వే పూర్తయింది. సర్వే పూర్తయిన వెంటనే మరోసారి పరిశీలన జరిపి గ్రామ సభల్లో అర్హులను ఎంపిక చేయనున్నారు.

నాలుగు విడతల్లో రూ. 5 లక్షలు...

జిల్లాలో ప్రధానంగా ఉన్న సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో ఏగె వేల ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఇంటి నిర్మాణానికి నాలుగు విడతలుగా ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించనున్నారు. లబ్ధిదారుల ఎంపికలో తొలి ప్రాధాన్యంగా నిరుపేదలు, దళితులు, గిరిజనులు వ్యవసాయ కూలీలు, పారిశుధ్య కార్మికులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ట్రాన్స్‌జెండర్లను ఎంపిక చేయనున్నారు. లబ్ధిదారుల్లో దివ్యాంగులకు ఐదు శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీ మైనార్టీలకు 50 శాతం, జనరల్ కేటగిరీ కింద 15 శాతం చొప్పున ఇళ్లను కేటాయించనున్నారు. ఇంటి నిర్మాణంలో పునాది స్థాయిలో రూ లక్ష, రెండో దశలో రూ 1.25 లక్షలు, మూడో దశలో స్లాబ్‌కు రూ. 1.75 లక్షలు, ఫినిషింగ్, ఇతర దశలకు రూ. లక్ష చొప్పున అందించనున్నారు.

మండలాల వారీగా సర్వే వివరాలు...

మండలం	వచ్చిన దరఖాస్తులు	సర్వే పూర్తయినవి
బోయినపల్లి	6,976	3,808
చందుర్తి	6,420	4,027
ఇల్లంతకుంట	10,216	6,985
గంభీరావుపేట	8,761	4,113
కోనరావుపేట	8,299	4,739
ముస్తాబాద్	9,460	5,190
రుద్రంగి	3,780	1,237
సిరిసిల్ల మున్సిపల్	12,454	6,767
తంగళ్లపల్లి	9,528	5,255
వీర్నపల్లి	3,668	2,957
వేములవాడ	4,960	2,334
వేములవాడ మున్సిపల్	8,591	5,576
వేములవాడ రూరల్	4,759	2,965
ఎల్లారెడ్డిపేట	9,526	3,869
మొత్తం	1,07,398	59,822

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంత్రి వర్గం నుంచి కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వాఖ్యలు తీవ్రంగా ఖండిస్తూ సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు మంగళవారం బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణతో పాటు కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంబేద్కర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఫ్లకార్డులు పట్టుకోని నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగంతో దేశప్రజలకు అనేక హక్కులు కల్పించబడ్డాయన్నారు. అలాంటి మహనీయుడిపై అమిత్‌షా అహంకారపూరితమైన మాటలు మాట్లాడడం దారుణమని అన్నారు. వెంటనే అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, పార్లమెంట్ కో కన్వీనర్ చక్రధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపరెడ్డి, మహిళ అధ్యక్షురాలు వనిత, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అకునూరి బాలరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సర్కారు ఆసుపత్రుల స్థితి మారదా?

- కేంద్రం నిధులిస్తున్నా మందులు, ఎక్స్‌రే లేదని రోగులను బయటకు పంపుతారా..
- 'దిశ' సమావేశంలో నిప్పులు చెరిగిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్

6



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

తంగళ్లపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. నెమలికొండ రమణాచార్య పంతులు ఆధ్వర్యంలో కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాదిమందికి అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మహిళల కోలాటాల మధ్య కల్యాణమూర్తుల ఊరేగింపు సాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో రక్షణ చర్యలు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్షణ చర్యలు చేపట్టారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఖాళీ మద్యం బీరు టిన్నులు, ధ్వంసమైన సెప్టిక్ ట్యాంకు వద్ద రోగులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 16న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఆరోగ్య కేంద్రానికి రక్షణ కరువు' అనే కథనానికి వైద్యాధికారులు మంగళవారం స్పందించారు. కేంద్రం ఆవరణలోని షెడ్డు వెనుక ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. ఖాళీ మద్యం బీరు టిన్నులు ఎక్కడ నుంచి వచ్చాయని విచారణ చేపట్టారు. ధ్వంసమై దుర్గంధం వెదజల్లుతున్న సెప్టిక్ ట్యాంకు పైపునకు మరమ్మతు పనులు చేశారు. ఆవరణలో పనులు చేపట్టడంతో రోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని వసతులను కల్పిస్తున్నామని వైద్యాధికారులు పేర్కొన్నారు.

మానకొండూర్ ఎమ్మెల్యేను కలిసిన టీజీవో నాయకులు



ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో టీజీవో నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులు మంగళవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కరీంనగర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సమరసేన, ఉపాధ్యక్షులు జానకి, కార్యదర్శి జాబీ, సభ్యులు శేఖర్, శ్రావ్య పాల్గొన్నారు.

ముస్తాఫనగర్‌లో కళాజాతా

గంభీరావుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌లో మంగళవారం సాంస్కృతిక కళాబృందం సభ్యులు ప్రదర్శన ఇచ్చారు. ప్రధానంగా పరిసరాల పరిశుభ్రత పచ్చదనం వంటి అంశాలను పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో టీం లీడర్ శ్రీధర్‌రెడ్డి, కళాబృందం సభ్యులు గడ్డం శ్రీనివాస్, రామచంద్రం, మాజీ వార్డు సభ్యుడు బండ రమేష్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయ బావిలో పడి వృద్ధుడి మృతి

వీణవంక, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్తిలో కొయ్యడ మొగిలి (63) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్యడ మొగిలి మంగళవారం ఉదయం మోటర్‌కు మరమ్మతులు చేస్తుండగా కాలు జారి వ్యవసాయ బావిలో పడి మునిగిపోయాడు. గమనించిన తోటి రైతులు, కుటుంబసభ్యులు బావిలో నుంచి మొగిలిని బయటకు తీశారు. అప్పటికే మొగిళి మృతి చెందాడు. మొగిలి భార్య కమ లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

● విద్యుదాఘాతంతో..

రాయికల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన గొల్లపెల్లి నర్సయ్య (56) అనే రైతు మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. రోజువారీగా పొలం పనుల్లో భాగంగా తన వ్యవసాయ భూమిలో గడ్డపారతో పనిచేస్తుండగా సర్వీస్ వైరు తగిలి నర్సయ్య విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లింగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

● అనుమానాస్పదంగా వృద్ధుడు..

గంగాధర, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండల కేంద్రానికి చెందిన పులిచర్ల భూమయ్య(70) అనే వృద్ధుడు రైలు పట్టాలపై మంగళవారం శవమై కనిపించాడు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధరకు చెందిన పులిచర్ల భూమయ్య భార్య గతంలో చనిపోగా ఒంటరిగా జీవిస్తున్నాడు. బయటకు వెళ్లిన భూమయ్య ఇంటికి రాలేదు. గంగాధర సమీపంలోని రైలు పట్టాలపై అతడి మృతదేహం కనిపించింది. భూమయ్యది ఆత్మహత్యానా లేక హత్య అనే వివరాలు తెలియాల్సి ఉంది. రైల్వే పట్టాలపై ఘటన జరగడంతో మంచిర్యాల నుంచి రైల్వే పోలీసులు వచ్చి పంచనామా చేయాల్సి ఉంది.

● రోడ్డు ప్రమాదంలో యువకుడు..

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన సబ్బని జగన్(36) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గూడెం గ్రామానికి చెందిన జగన్ తన బైక్‌పై స్వగ్రామం నుంచి ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని బంధువుల శుభకార్యానికి సోమవారం రాత్రి బయలుదేరాడు. ఈ క్రమంలో రాగట్లపల్లి శివారులోని మూలమలుపు వద్ద ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడు జగన్ భార్య దివ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలు ఆత్మహత్య

ఇల్లంతకుంట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన బండ గౌరవ్వ (80) అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ గౌడ్ వివరాల ప్రకారం.. గౌరవ్వ కొద్ది సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. అనేక ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో ఆదివారం రాత్రి అధిక మోతాదులో బీపీ, గుండె సంబంధిత మాత్రలు మింగింది. సోమవారం వాంతులు కావడంతో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట జిల్లాలోని వైద్య కళాశాలకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలు గౌరవ్వ కొడుకు రామచంద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతుపై కత్తితో దాడి

వీణవంక, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన వెంకటరాజురెడ్డి తనమొక్కజొన్న చేనుకు నీరు పెడుతున్న క్రమంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో ఎడమ చేయి నాలుగు వేళ్ల తెగిపోయాయి. వెంటనే బాధితుడిని చికిత్స నిమిత్తం హన్మకొండ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. వెంకటరాజురెడ్డి భార్య మారం విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. ఎవరు దాడి చేశారనే వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

ఆర్టీసీ బస్సులు ఢీ

శంకరపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ గ్రామ శివారులోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై రెండు ఆర్టీసీ బస్సులు ఢీ కొన్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం వరంగల్-1 డిపోనకు చెందిన ఆర్టీసీ డీలక్స్ బస్సు కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తుంది. బోధన్ డిపోకు చెందిన బస్సు వరంగల్ నుంచి బోధన్‌కు వెళ్తుండగా, తాడికల్ గ్రామ శివారులో ఈ రెండు బస్సులు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో వరంగల్ డిపోనకు చెందిన బస్సు రోడ్డు దిగి వ్యవసాయ బావి ముందున్న కరెంటు స్తంభాన్ని ఢీ కొట్టి ఆగింది. దీంతో పెను ప్రమాదం నుంచి బయటపడ్డామని ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. బోధన్ డిపో బస్సుకు చెందిన డ్రైవర్ బోయ రాఘవేంద్రకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్టు

గొల్లపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం లొత్తునూర్ గ్రామానికి చెందిన లక్కం అజయ్ (24) అనే యువకుడు గొల్లపల్లి మం డల కేంద్రంలో గంజాయి తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ మంగళవారం తెలిపారు.గొల్లపల్లి మండల కేంద్రం లో అజ య్ వద్ద 200 గ్రాముల గంజాయి తరలిస్తూ పోలీసులకు పటుబడడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కార్పొరేటర్‌తో పాటు మరో ఇదర్దిపై కేసు

కోల్‌సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి సమీపంలోని స్థలంలో చొరబడి నిర్మాణంలో ఉన్న ప్రహరీని కూల్చివేసి చంపుతానని బెదిరించిన ఫిర్యాదుపై రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్ కార్పొరేటర్ మంచికట్ల దయాకర్, మోహన్‌గౌడ్, శ్రీనివాస్‌లపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. జనగామ శివారు సర్వే నంబరు 676లో తన స్థలంలో ప్రహరీ నిర్మిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున కూల్చివేశారని, అడ్డువెళ్లిన తనను చంపుతానని బెదిరించారని పెద్దపల్లిలోని శివాలయం వీధికి చెందిన ఠాకూర్ రూపాదేవి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బీఎన్ఎస్ 329 సెక్షన్3, 324, 351 తదితర సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

అంబారిపేటలో బాలిక అదృశ్యం

కథలాపూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబారిపేటకు చెందిన ఓ బాలిక నాలుగు రోజుల క్రితం అదృశ్యమైనట్లు తెలిసింది. దీనిపై మంగళవారం బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికకు గత 15 రోజుల క్రితం తల్లిదండ్రులు వివాహం చేసినట్టు తెలిసింది. బాలిక అత్తగారి ఇంటి నుంచి తప్పించుకుని సిరిసిల్లలోని బాలిక సంరక్షణ కేంద్రం (సఖి) సెంటర్‌కు చేరినట్టు పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై నవీన్‌కుమార్ సఖి కేంద్రం నిర్వాహకులతో మాట్లాడి వివరాలను సేకరించారు.

అటవీ భూమిని దున్నిన ట్రాక్టర్ సీజ్

చందుర్తి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మల్యాల, చందుర్తి సెక్షన్ రేంజ్‌లోని సనుగుల బీట్ పరిధిలో అటవీ భూమిని దున్నిన ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు ఎఫ్ఆర్వో ఖలీలుద్దీన్ మంగళవారం తెలిపారు. సనుగుల బీట్ పరిధిలో అటవీ భూమిని సనువుల గ్రామానికి చెందిన పిట్ల రాజయ్య అనే వ్యక్తి ముచ్చర్ల ఎల్లయ్య అనే ట్రాక్టర్ డ్రైవర్‌తో అటవీ భూమిని దున్నిస్తున్నారని సమాచారం అందిందన్నారు. సంఘటనా స్థలానికి వెళ్లగా రాజయ్య, ఎల్లయ్యలు పారిపోయారని వివరించారు. ట్రాక్టర్‌ను పోలీసుల సహాయంతో సీజ్ చేసినట్లు తెలిపారు. ఎఫ్ఎస్‌వో అబ్దుల్ హుస్సేన్, అన్వార్ హుస్సేన్, ఎఫ్‌బీవోలు బాలకృష్ణ, సుదర్శన్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

'రామగుండం'పై పారిశుధ్య భారం



- నగరపాలక సంస్థకు భారంగా మారిన నిర్వహణ
- పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలని ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రతిపాదనలు
- సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు కలెక్టర్ లేఖలు

కోల్‌సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌పై పారిశుధ్య నిర్వహణ భారంగా మారింది. ఆదాయం అంతంత మాత్రంగా ఉన్న కార్పొరేషన్‌కు కార్మికుల వేతనాలు, వాహనాల ఇంధనం, నిర్వహణ తడిసి మోపడవుతున్నాయి. పారిశుధ్య కార్మికుల వేతనాలు, ఇంధనానికే నెలకు సుమారు కోటి రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. రామగుండంలో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమలు విస్తరించి ఉన్న ప్రాంతాల్లోనూ కార్పొరేషన్‌లో పారిశుధ్య నిర్వహణ మున్సిపల్ కార్పొరేషనే చేస్తోంది. ఏటా వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్న ఆయా పరిశ్రమలు చెల్లిస్తున్న పన్నులు ఏమూలకు సరిపోవడం లేదు. ఈ పరిస్థితుల్లో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య నిర్వహణలో ఆయా పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రతిపాదించారు. పరిశ్రమలతో నవంబర్‌లో సమావేశాన్ని కూడా నిర్వహించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌కు పరిశ్రమల పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ భారంగా మారిందని, పారిశుధ్య నిర్వహణలో సిం గరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్‌లు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ సూచించారు. ఈ మేరకు ఈ మూడు సంస్థలకు లేఖలు పంపారు.

ఎన్టీపీసీ పరిధిలో 36వేల జనాభా...

ఎన్టీపీసీ పరిసర ప్రభావిత ప్రాంతాల్లో మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి 8డివిజన్లు ఉన్నాయి. ఇందులో కొన్ని డివిజన్లు పాక్షిక ప్రభావం ఉండగా, కొన్ని డివిజన్లలో పూర్తి ప్రభావం ఉంది. ఎన్‌టీపీసీకి సంబంధించి ఈ డివిజన్ల పరిధిలో 36,577జనాభా ఉంది. ఇందులో ఇంటింటా చెత్త సేకరణకు 23ట్రాలీలు అవసరం పడతాయని, ఒక సూపర్ క్యారీ బీఎస్-6 వాహనం అవసరం పడుతుందని అంచనా వేస్తున్నారు. వాహనానికి రూ.1.66కోట్లు వ్యయం అవుతుంది. అలాగే 103మంది పారిశుధ్య సిబ్బంది, 23మంది డ్రైవర్లు, హెల్పర్లు కలిపి 149మందికి వేతనాల వ్యయం రూ.1.6కోట్లు, ఇంధన చార్జీలు రూ.4లక్షలు మొత్తంగా రూ.3.3కోట్లు అవసరమవుతాయని లెక్కగట్టారు. డిసెంబర్ 2024 నుంచి జనవరి 2025వరకు రూ.3కోట్లు వ్యయం కానున్నది.

ఆర్‌ఎఫ్‌సీఎల్ పరిసరాల్లో 33వేల జనాభా..

ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రభావిత, పరిసర ప్రాంతాల్లో కార్పొరేషన్ పరిధిలోని 8డివిజన్లు, 33వేల జనాభా ఉంది. ఇందులో నిబంధనల ప్రకారం 21ట్రాలీలు, చెత్త తరలింపునకు భారీ వాహనం అవసరమవుతుందని అంచనా వేశారు. పారిశుధ్య నిర్వహణకు ఏడాదికి రూ.3.02కోట్లు వ్యయం కానున్నది.

సింగరేణి పరిధిలో...

సింగరేణి ఆర్‌జీ-1,2 పరిధిలో పారిశుధ్య నిర్వహణకు సంబంధించి యాజమాన్యం సివిక్ మెయింటనెన్స్ నిర్వహిస్తుంది. ఆర్‌జీ-1 పరిధిలో 14 డివిజన్లు ఉన్నాయి. ఇందులో లక్షకు పైగా జనాభా ఉంది. సింగరేణి యాజమాన్యం తమ క్వార్టర్లు ఉన్న కాలనీలు, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ చేపడుతుంది. కేవలం 5,549 క్వార్టర్లను లెక్కగట్టి పారిశుధ్య పనులు అప్పగిస్తుంది. దీనిని మరింత పెంచాల్సిన అవసరం ఉంది. గతంలో ప్రధాన రహదారులన్నీ సింగరేణే నిర్వహణ చేసేది. ఇప్పుడు బాధ్యతలను కార్పొరేషన్‌పై నెట్టింది. అలాగే ఆర్‌జీ-2 పరిధిలో మరో 5,500క్వార్టర్లను లెక్కగట్టి నిర్వహణ అప్పగించారు. ఖచ్చితంగా పరిసర ప్రాంతాల్లో ఇంటింటా చెత్త సేకరణ జరపాలని, అదనంగా వాహనాలను, కార్మికులను సమకూర్చాలని, డ్రైన్ల పూడిక తీత, ఫాగింగ్ పనులు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

చెత్త ఊడవడం నుంచి నాలాల వరకు..

సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ పరిధిలో రోడ్లపై చెత్త ఊడవడం, ఇంటింటా చెత్త సేకరణ, నాలాల పూడికతీత అంతా కార్పొరేషన్‌పైనే భారం ఉంది. కార్పొరేషన్ పరిధిలో ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి ఇందిరానగర్, అడ్డగుంటపల్లి, విఠల్‌నగర్ నాలాలు, ఎన్టీపీసీ నుంచి రామకృష్ణ థియేటర్, పోలీస్ హెడ్‌క్వార్టర్ నాలాలు ఉన్నాయి. గోదావరిఖని, ఛైటింక్లయిన్‌కాలనీల్లోని నాలాలన్నీ సింగరేణి కాలనీలు, గనుల వద్ద నుంచి పుట్టుకొచ్చినవే. ఒక్కనాలా నిర్మాణానికి కూడా పరిశ్రమలు నిధులు ఇవ్వలేదు, భాగస్వామ్యం కాలేదు. నిర్వహణ కూడా చేపట్టడం లేదు. ఈ పరిశ్రమల పరిసర డివిజన్లలో మున్సిపాలిటీనే ఇంటింటా చెత్త సేకరణ, నాలాల పూడికతీత, రోడ్లు ఊడవడం వంటి కార్యక్రమాలు చేస్తున్నది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 10వేల జనాభా ఉంటే 28మంది కార్మికులను నియమించాల్సి ఉంది. అలాగే 400ఇళ్లకు చెత్తసేకరణకు ఒక్కో రిక్షాను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కార్పొరేషన్‌లో పారిశుధ్య విభాగంలో 448మంది కార్మికులు పనిచేస్తుండగా, వారి వేతనాలకు రూ.70లక్షలు, వాహనాల ఇంధనానికి రూ.16లక్షలు, ఇతర పారిశుధ్య నిర్వహణ పనులకు మరో రూ.25లక్షలు ప్రతినెలా ఖర్చు చేస్తున్నారు. ప్రతి ఏటా నాలాల పూడికతీతకు రూ.50లక్షలు వెచ్చిస్తున్నారు.

● కార్పొరేట్ కార్యాలయాలకు ప్రతిపాదనలు..

ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ సంస్థలు ఈ ప్రాంతంలోని వేలాది ఎకరాల భూములను తీసుకుని వేల కోట్ల టర్నోవర్‌తో భారీ లాభాలు ఆర్జిస్తున్నాయి. ఈప్రాంత సంక్షేమంలో, అభివృద్ధి భాగస్వామ్యం కావడం లేదనే ఆరోపణలున్నాయి. పైగా ఈ పరిశ్రమల కాలుష్యం ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి వెదజల్లే వ్యర్థజలాలు ఈ ప్రాంత ప్రజలకు ముప్పుగా మారాయి. ఎన్టీపీసీ కాలుష్యంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఒక్క సింగరేణి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో ఉన్నందున ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు వెచ్చిస్తుంది. మెడికల్ కళాశాలకే రూ.500కోట్లు ఇచ్చింది. రోడ్లు, డ్రైన్లు, షాపింగ్‌లు, ఇతర పనులకు భారీగా నిధులు ఇస్తుంది. ఈ పరిస్థితుల్లో పారిశుధ్య పనుల్లో పరిశ్రమలు భాగస్వామ్యం కావాలనే ఒత్తిళ్లు రావడంతో ప్రజల నుంచి పెరిగాయి. దీంతో కలెక్టర్ నుంచి వచ్చిన ప్రతిపాదనలను ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ సంస్థలు కార్పొరేట్‌కు పంపాయి.

ట్రేడ్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ పేరిట టోకరా

- రూ.5.90 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు
- మరో రూ.5 లక్షలు పోకుండా కాపాడిన సైబర్ క్రైం పోలీసులు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన అఖిల్ అనే వ్యక్తి సైబర్ నేరస్థుల బారిన పడి 5.90 లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడు. మరో 5 లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైన సమయంలో కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు కాపాడారు. సైబర్ క్రైం పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం కరీంనగర్ టవర్ సర్కిల్ ప్రాంతంలో ఒక చిరువ్యాపారం నిర్వహిస్తున్న అఖిల్ అనే వ్యక్తికి ఈ నెల 17న వాట్సప్ లింక్ మెస్సేజ్ వచ్చింది. గ్లోబల్ మార్కెట్‌లో ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే త్వరగా రెట్టింపు డబ్బులు వస్తాయని నమ్మించారు. ఆ లింక్‌ను ఇన్‌స్టాగ్రాం ద్వారా ఓపెన్ చేసిన అఖిల్ మొదట వెయ్యి, రెండు వేల వంతున దఫ దఫాలుగా మొత్తం 5 లక్షల 90 వేల రూపాయలు పెట్టుబడిగా డబ్బులు సైబర్ నేరగాళ్లు సూచించిన ఖాతాకు పంపించాడు. మొదట 4 వేల రూపాయలు ఇన్వెస్ట్ చేయగా 6,600 రూపాయలు అతడి ఖాతాకు జమ అయ్యాయి. ఇది నమ్మిన అఖిల్ కొద్ది రోజులుగా డబ్బులు ఇన్వెస్ట్ చేస్తూ పోయాడు. మరో 5 లక్షలు పెట్టుబడి పెడితేనే మిగతా డబ్బులతో కలిపి మొత్తం డబ్బులు తిరిగి వస్తాయని నమ్మించారు. 5లక్షల 90వేల రూపాయలు దక్కించు కోవాలంటే మరో 5 లక్షలు కావాలని ఆలోచించి తన ఇంటిలో బంగారాన్ని కుదువపెట్టేందుకు బ్యాంక్ ఆఫ్ బరోడాకు వెళ్లి మేనేజర్‌ను కలిశాడు. అఖిల్ తనకు రుణం కావాలని, అందుకుగాను బంగారం తాకట్టు పెట్టుకో వాలని మేనేజర్‌ను కోరగా మేనేజర్‌కు అనుమానం వచ్చి వెంటనే కరీంనగర్ సైబర్ పోలీసులకు సమాచారం అందించాడు. సైబర్ క్రైం పోలీసులు బ్యాంక్ వద్దకు చేరుకుని అఖిల్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి సైబర్ మోసం జరిగిందని అవగాహన కల్పించారు. గ్లోబల్ మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్ పేరిట సైబర్ నేరస్తులు చీటింగ్ చేశారని వివరించారు. మరో 5 లక్షల రూపాయలు సైబర్ నేరగాళ్ల ఖాతాలో జమ చేసేందుకు సిద్ధమ యిన అఖిల్‌ను కాపాడారు. బాధితుడి ఫిర్యాదుతో కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్లోబల్ మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్, ఉద్యోగాలు, డిజి టల్ అరెస్టు, డ్రగ్స్ పార్సల్ వంటి మెస్సేజ్, కాల్స్ వచ్చిన సందర్భాలలో ప్రజలు స్పందిం చవద్దని సైబర్ క్రైం పోలీసులు కోరారు.

ఇసుక డంపుల పట్టివేత

కథలాపూర్, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని బొమ్మెనలో మంగళ వారం పలు ప్రాంతాల్లో నిల్వ ఉంచిన ఇసుక డంపులను తహసీల్దార్ వినోద్, ఆర్ఐ నగేశ్ పట్టుకున్నారు. మూడు ప్రాంతాల్లో 86 ట్రిప్పులను స్వాధీనం చేసుకుని బహిరంగ వేలం నిర్వహించారు. ట్రిప్పుకు వెయ్యి రూ పాయల చొప్పున ప్రభుత్వ ఖజానాకు టెం డర్‌లో పాల్గొన్న వ్యక్తి డీడీ రూపంలో చెల్లిం చినట్టు తహసీల్దార్ తెలిపారు. సిరికొండ, తక్కళ్లపల్లి, దూలూరు గ్రామాల్లో పెద్ద వాగులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని జరిమానా విధించామ న్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో జూని యర్ అసిస్టెంట్ మురళి, సిబ్బంది ఉన్నారు.

ఎస్‌యూలో నూతన కోర్సులు ఏర్పాటు చేయాలి

గణేశ్‌నగర్, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో కొత్త కోర్సులు ఏర్పాటు చేయాలని వీసీ ఉమేష్‌కుమార్‌కు బీసీ యువజన సంఘాల అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ మంగళ వారం వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ శాతవాహన విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ కళాశాల, లా కళాశాలను త్వరగా ఏర్పాటు చేయాల న్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సుగా మార్చాలని కోరామన్నారు. త్వరలోనే నూతన కోర్సులను కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటా మని వీసీ హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు గుంటి స్వరూపశ్యాం,బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల ఉమా మహేశ్వర్,బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్కారు ఆసుపత్రుల తీరు మారదా?

- కేంద్రం నిధులిస్తున్నా మందులు, ఎక్స్‌రే లేదని రోగులను బయటకు పంపుతారా..
- పేదలను ఇబ్బంది పెడితే ఊరుకోం
- కట్టెలపొయ్యిలపైనే మధ్యాహ్న భోజనం వండుతున్నారా..
- విద్యార్థులు పొగతో ఇబ్బంది పడుతుంటే అధికారులేం చేస్తున్నారు..
- దిశ సమావేశంలో నిప్పులు చెరిగిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్

కరీంనగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రం నిధులిస్తున్నా సర్కారు ఆసుపత్రుల స్థితి మారడం లేదు.. కాటన్, మందులు, ఎక్స్‌రే లేదని రోగులను బయటకు పంపిస్తున్నారు.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గోల్‌మాల్ జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేద ' అంటూ అధికారులపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం కరీంనగర్ కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ వివిధ శాఖలపై పనితీరుపై సమీక్షించారు. అధికారుల అలసత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను గడువు ముగిసినా పూర్తి చేయని కాంట్రాక్టర్లకు 60 సీ కింద నోటీసులిచ్చి చర్యలు తీసుకోవాలని కరీంనగర్, సిరిసిల్ల కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మారాల్సిందేనని, లేకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేషనల్ హెల్త్ మిషన్ నియామకాల్లోనూ భారీ ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

● అధ్వానంగా ఆసుపత్రులు

కరీంనగర్, సిరిసిల్ల జిల్లా ఆసుపత్రుల పరిస్థితి అధ్వానంగా తయారైందని, నిధుల గోల్ మాల్‌పై ఆరోపణలు వస్తున్నా ఎందు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కరీంనగర్ ఆసుపత్రిలో ఎక్స్‌రే మిషన్ పని చేయడం లేదని, చిన్న రిపేర్ చేస్తే బాగవుతుందని తెలిసీ.. దానిని మూలన పడేసి రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు పంపుతున్నారన్నారు. తన జన్మదినం సందర్భంగా నాలుగు కోట్ల రూపాయల విలువ చేసే పరికరాలు, అంబులెన్సును అందజేస్తే... చిన్న రిపేర్ వచ్చిందని అంబులెన్సును మూలన పడేశారన్నారు. మళ్లీ 'దిశ' సమావేశం నిర్వహించే నాటికి ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మారిపోవాలన్నారు. అట్లాగే టీ హబ్‌లో నిర్వహించే ల్యాబ్ పరీక్షల నిధులన్నీ కేంద్రానివేనని, టీ హబ్ బోర్డుపై మాత్రం ప్రధాని ఫొటో ఎందుకు ఉంచరని ప్రశ్నించారు. నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో చేపడుతున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని తనకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఎంత మందిని ఏ ప్రాతిపదికన ఉద్యోగంలోకి తీసుకున్నారనే పూర్తి వివరాలివ్వాలని, ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. టీబీ రోగులకు పోషకాహారం కోసం మూడు వేలు అందిస్తున్నామా? 30 వేలు అందిస్తున్నామా.. అని ప్రశ్నించారు. నివేదిక తప్పుల తడకగా ఉంటే ఎలా? అసలు వాళ్లకు ఎంత ఇస్తున్నామో మీకు సరిగా తెలియడం లేదంటే ఏమనుకోవాలి.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు.



సమావేశంలో పాల్గొన్న కేంద్ర సహాయ శాఖ మంత్రి బండి సంజయ్, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

● కేంద్ర నిధులతో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌లో ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. అసలు ఎంతమంది విద్యార్థులు ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్నారు.. వాళ్ళ పెర్ఫార్మెన్స్ ఎలా ఉంది అని ప్రశ్నించారు. అధికారుల నుంచి సమాధానం రాకపోవడంతో.. డీఈవో ఏం చేస్తున్నారు. మీరు ఎన్ని ల్యాబ్‌లను విజిట్ చేశారని ప్రశ్నించారు.

● 'మధ్యాహ్న భోజనం' గుడ్లు ఎందుకివ్వడం లేదు?

మధ్యాహ్న భోజన పథకంలో గుడ్లు ఇవ్వడం లేదని నిత్యం వార్తలొస్తున్నాయని, అరటి పండుతో సరిపెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని బండి సంజయ్‌కుమార్ అన్నారు. ధర పెరగడంతో గుడ్లు ఇవ్వలేకపోతున్నామని అధికారులు చెప్పారు. ఈ విషయాన్ని ఇప్పటిదాకా మా దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేదలందరికీ ఉచితంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇస్తున్నారని, వందలాది మంది విద్యార్థులు చదువుకునే పాఠశాలల్లో కట్టెల పొయ్యిపై వంట చేయడం ఎంతవరకు సమంజస మన్నారు. గ్యాస్ కోసం సిరిసిల్లకు 52లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.. కరీంనగర్ ఈ విషయంపై ఎందుకు దృష్టి సారించలేదని ప్రశ్నిం చారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో ఎ పైలట్ ప్రాజెక్టుగా ఎల్‌పీజీతోనే వంట చేయాలని, దీనిపై రెండు జిల్లాల కలెక్టర్లు దృష్టి పెట్టాన్నారు. 20 రోజుల్లో దీనిని పూర్తిస్థాయిలో దీనిని అమలు చేయాలని ఆదేశించారు.

● విద్యార్థులకు రవాణా ఖర్చులు ఇస్తున్నారా..?

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కేంద్ర రవాణా ఖర్చులు ఇస్తోందని, కరీంనగర్ జిల్లాలో 13, సిరిసిల్లలో 11 పాఠశాలలను ఇందుకు ఎంపిక చేశామని, ఆ పాఠశాలల విద్యార్థులకు డబ్బులు ఇస్తున్నారా.. అని ప్రశ్నించారు. ఇందుకు కేంద్రం 52 లక్షలు విడుదల చేసిందని, వాటిని దేనికి ఖర్చు చేశారని అడిగారు. ఈ అంశంపై తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పీఎం శ్రీ పథకం కింద ప్రతి ఏడాదికి 40 లక్షల రూపాయిల చొప్పున నిధులు ఐదేళ్లపాటు అందుతాయని, ఈ నిధులను పక్కాగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా వాడితే బాగుంటుందన్నారు. ఈ నిధులు ఇతర అంశాలకు మళ్లకుండా కలెక్టర్లు బాధ్యత వహించాలన్నారు. సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ)లో సిరిసిల్ల జిల్లాకు 28.62 కోట్ల ఇస్తే.. 8.55 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారన్నారు. మిగిలిన నిధులు ఎందుకు ఖర్చు పెట్టలేదని ప్రశ్నించారు. ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులకు సక్రమంగా వేతనాలిస్తే వారెందుకు ఆందోళన చేస్తున్నారన్నారు.

● పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో భాగంగా సిరిసిల్ల జిల్లాకు 12 రోడ్లు మంజూరు చేస్తే ఇందులో ఒకటే పూర్తయిందని బండి సంజయ్‌కుమార్ తెలిపారు. కరీంనగర్‌లోనూ ఇదే పరిస్థితి ఉందని, నిర్ణీత గడువులోగా ఎందుకు పూర్తి చేయడంలేదన్నారు. ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తీగలగుట్టపల్లిలో ఆర్వోబీ నిధులు తెస్తే పనులు ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారని అడిగారు. ఈఎన్సీ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకుని సైడ్ రోడ్లకు 36 లక్షలు మంజూరు చేయించినా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ప్రజలంటే ఇంత నిర్లక్ష్యమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు జిల్లాల కలెక్టర్లు మధ్యలో నిలిచిపోయిన రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి 10 రోజుల్లో విచారణ జరిపి కాంట్రాక్టర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై జనవరి తొలివారానికల్లా తనకు నివేదిక ఇవ్వాలన్నారు. పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఆదేశించారు.

● దివ్యాంగులందరికీ పరికరాలు

దివ్యాంగులకు పరికరాలు అందించేందుకు అమలు చేస్తున్న సుగమ్య భారత్ అభియాన్ మంచి ఫలితాలిస్తోందని బండి సంజయ్ తెలిపారు. ప్రజావాణితోసహా ఎక్కడ చూసినా ఇంకా దివ్యాంగులు లైన్లో నిలబడి పరికరాల కోసం వినతిపత్రాలిస్తున్నారని, ఏయే పరికరాలు కావాలనే వివరాలు తనకు పంపాలన్నారు. అవసరమైతే ఎంపీ ల్యాడ్స్ నిధులను వినియోగించి అందరికీ పరికరాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేద్దామన్నారు.

● స్మార్ట్‌సిటీ పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయి?

ప్రభుత్వ అధికారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కళ్లుగా భావించాలని, కొందరు అధికారులు కేంద్ర పథకాలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ కింద 398 కోట్ల రూపాయలు మంజూరు చేసినా పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని ప్రశ్నించారు. యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమర్పించకపోవడంవల్లే కేంద్రం మిగిలిన నిధులు మంజూరు చేయడం లేదన్నారు. త్వరగా యూసీ సమర్పిస్తే మిగిలిన 70 కోట్ల నిధులను మంజూరు చేయిస్తానన్నారు. నగరంలో చేపట్టిన రోడ్లు మధ్యలోనే ఆగిపోయాయని, అవి పూర్తయిన తరువాతనే కొత్త రోడ్లను మంజూరు చేయాలని సూచించారు.

● వంద రోజుల పని దినాలు ఎందుకు కల్పించలేకపోతున్నారు..?

కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఆశించిన సంఖ్యలో ఎందుకు పనిదినాలు కల్పించలేకపోతున్నారని అధికారులను బండి సంజయ్ ప్రశ్నించారు. 90 వేలకు పైగా జాబ్ కార్డులుంటే చాలా తక్కువ మందికి పని కల్పిస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వేతనం కూడా తక్కువ వస్తోందని తెలిపారు. వీటిపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. కచ్చితంగా వంద రోజుల పని కల్పిస్తే... ఆ కుటుంబాల్లోని పిల్లలకు ఉన్నతి 'ఉన్నతి' కార్యక్రమం ద్వారా ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇస్తామన్నారు.

● గతంలో తక్కువ విద్యుత్తు వినియోగించుకునే విధంగా ఫ్యాన్లను మహిళా సంఘాలకు అందించామని, అవి ఎందరు అర్హులకు అందిచాఆమో వివరాలివ్వాలని ఆదేశించారు.

● ఎంపీ నిధుల అభివృద్ధి పనుల విషయంలో అనుకున్నంత ప్రగతి కనిపించడం లేదన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిధులను ఎందుకు సరిగా వినియోగించలేకపోతున్నారని ప్రశ్నించారు. రెండు జిల్లాల్లో ఎంపీ నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ సునీల్‌రావు, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, సిరిసిల్ల కలెక్టర్ సంతోష్‌కుమార్ ఝా, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యక్తిగత కార్యదర్శి అంద్ర వంశీ, కరీంనగర్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ వాజ్‌పాయి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి

సైక్లింగ్ పోటీలు



సైక్లింగ్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

సుల్తానాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలను పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభించారు. మంగళవారం జిల్లా ఎస్ జీ ఎఫ్ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ ఈ పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాలకు చెందిన పలువురు క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పీడీ ఆంతటి శంక రయ్య తెలిపారు. విజేతలకు మంగళ వారం సాయంత్రం మెడల్స్‌ను అంద జేశారు. కాగా రాష్ట్ర స్థాయికి ఎంపికయిన వారు ఈనెల 27న హైదరాబాద్‌లో జరిగే పోటీ లలో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, పీడీ రమేష్, ఆధ్యాపకులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా సైక్లింగ్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అంబే ద్కర్ స్టేడియంలో బుధవారం ఉమ్మడి జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలను నిర్వహి స్తున్నామని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురభి వేణుగోపాల్ తెలిపారు. క్రీడాకారులు అంబేద్కర్ స్టేడి యంలో ఉదయం 9గంటలకు హాజరు కావాలని తెలిపారు. క్రీడాకారులు ఆయా జిల్లాల కార్యదర్శులతో సంతకం చేయించి లిస్టును వెంట తీసుకుని రావాలని సూచిం చారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకా రులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు.



గత వైభవ చిహ్నం.. మొలంగూర్ ఖిల్లా



మొలంగూర్ ఖిల్లాకు ప్రవేశ ద్వారం

- శిథిలమవుతున్న చారిత్రక సంపద
- పర్యాటక కేంద్రంగా రూపొందించాలని డిమాండ్

శంకరపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చారిత్రక కట్టడాలు గత వైభవానికి చిహ్నాలుగా నిలుస్తున్నాయి. వందల ఏళ్ల క్రితం పాలించిన రాజుల చరిత్రకు నిలువుటద్దంలా ఉన్నాయి. శత్రువుల నుంచి రక్షణకు పెద్ద పెద్ద గుట్టలపై రాతి కట్టడాలు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని మొలంగూర్ ఖిల్లా చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. మొలంగూర్ ఖిల్లా కరీంనగర్‌కు 30 కిలోమీటర్ల దూరంలో.. వరంగల్‌కు 46 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఓరుగల్లు, ఎలగందుల కోటలను మధ్య లో మొలంగూర్ ఖిల్లాను నాటి పాలకులు నిర్మించారు.



సైకిల్‌పై దూద్ బావి నీళ్లను తీసుకెళ్తున్న గ్రామస్థులు

ఖిల్లా చరిత్ర

శత్రు దుర్భేద్యమైన మొలంగూర్ ఖిల్లా 13వ శతాబ్దంలో కాకతీయ వంశానికి చెందిన ప్రతాపరుద్రుడి సామంతుల్లో ఒకరైన ఒరగిరి మొగ్గరాజు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ కోటను గుట్టపైన విశాలమైన ప్రదేశంలో శత్రువులు ప్రవేశించడానికి వీలు లేకుండా నిర్మించారు. కోట చుట్టూ రాతి ప్రాకారం ఏర్పాటు చేశారు. అక్కడక్కడ బురుజులు, ఫిరంగులు ఉన్నాయి. కోట పైన సహజ సిద్ధంగా ఏర్పడ్డ కొనేరు ఉంది. కొనేరులో నీరు అన్ని కాలాల్లో లభించేదని స్థానికులు చెబుతుంటారు. ఈ కొండపైన ఉన్న కోటను చేరుకోవడానికి కొంత దూరం రాతితో మెట్లు నిర్మించారు. ఆ తర్వాత క్లిష్టమైన మార్గం ఉంటుంది. స్థానికులు శ్రావణమాసంతో పాటు ఇతర సందర్భాల్లో కొండపైన ఉన్న ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్తుంటారు. ఈ కోటపై ఏర్పాటు చేసిన ఓ ప్రాంతంలో నూనె పోసి స్థానికులు ఇప్పటికీ దీపం వెలిగిస్తారు.

అబ్బురపరిచే దూద్ బౌలి (దూద్ బావి)..

మొలంగూర్ దూద్‌బావి నీళ్లు ప్రత్యేకంగా ఉంటాయి. నేటికీ మండల ప్రజలతో పాటు సుదూర ప్రాంతం నుంచి వచ్చి ఈ నీటిని తాగేందుకు ఆసక్తి కనబరుస్తారు. ఖిల్లా ముఖం ద్వారం నుంచి ముందుకు వెళ్లగానే దూద్‌బావి దర్శనమిస్తుంది. ఈ బావి కొండ కింది భాగంలో ఉంది. కొండపై వనమూలికల చెట్ల వేర్లను తాకుతూ ఊట ద్వారా ఆ నీరు బావిలోకి చేరుతుందని స్థానికులు చెబుతుంటారు. దూద్ బావిలోకి చేరిన నీరు పాలవలె తెల్లగా ఉంటాయి. దూద్ బావి నీరు తాగడం వల్ల వ్యాధులు దరిచేరవని నమ్ముతారు. ఈ నీటిని వడపోయాల్సిన అవసరం లేకుండా స్వచ్ఛంగా ఉంటాయి.



దూద్ బావి

కేంద్ర పర్యాటక పురావస్తు శాఖాధికారుల సర్వే

శంకరపట్నం మండలం మొలంగూర్ ఖిల్లాను కేంద్ర పర్యాటక పురావస్తు శాఖాధికారులు సందర్శించి.. సర్వే చేసి శాంపిల్స్ సేకరించారు. ఖిల్లాను గ్రానైట్ వ్యాపారుల నుంచి కాపాడాలని, పర్యాటకంగా అభివృద్ధి చేయాలని, అప్పటి బీసీ సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ జక్కని సంజయ్‌కుమార్ అప్పటి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని, సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కేంద్ర పర్యాటక పురావస్తు శాఖాధికారులు తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి కృష్ణచైతన్య, వరంగల్ రీజనల్ కన్జర్వేటివ్ అసిస్టెంట్ మడిపల్లి మల్లేష్, సహాయ పురావస్తు శాఖాధికారి ఈసారపు సాయి కృష్ణలు ఖిల్లా సందర్శించి, కొండపై కోట కట్టడాలను, దూద్ బావి, కొనేరులు, ఇతర ఖిల్లా పరిసరాలను పరి శీలించి సర్వే చేశారు. శాంపిల్స్ సేకరించి టెస్టులు చేసి, ఖిల్లాను కేంద్ర పురావస్తు పర్యాటక శాఖ ద్వారా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఖిల్లా ఆవరణలో బోర్డులు ఏర్పాటు చేశారు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి..


- జక్కని సంజయ్‌కుమార్, బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు



చారిత్రక కట్టడాల నిలయమైన మొలంగూర్ ఖిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఎనిమిది సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నాం. ఈ క్రమంలో ఖిల్లాను గ్రానైట్ వ్యాపారుల నుంచి కాపాడగలిగాం. ప్రజా పోరాటాల ఫలితంగా కేంద్ర పురావస్తు పర్యాటక శాఖ ఖిల్లాను పర్యటక ప్రాంతంగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చారిత్రక కట్టడాలను కాపాడాల్సిన బాధ్యత, ఖిల్లాను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలి. మొలంగూర్‌లోని దూద్ బావి దేశంలోనే ప్రఖ్యాతి చెందినది. రెండు కొండల మధ్య రోప్‌వే నిర్మించడం వల్ల అద్భుత పర్యాటక ప్రాంతంగా తీసుకురావచ్చు.

సందర్శకుల తాకిడి..

మొలంగూర్ ఖిల్లా అందాలను చూడడానికి సందర్శకులు కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు ఇతర జిల్లాలో నుంచి కూడా వస్తారు. మొలంగూర్ ఖిల్లా చరిత్రను తెలుసుకోవడానికి ఆనాటి కళా వైభవాన్ని చూడడానికి విద్యార్థులు విహారయాత్రకు వస్తుంటారు. కొండపై వైవిధ్యమైన మొక్కలు ఉండడంతో విద్యా ర్థులు బొటానికల్ టూర్‌కు వస్తుంటారు. కరీంనగర్ జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు వస్తున్నప్పటికీ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోలేదు.



మొలంగూర్ కొండపై రాతి ప్రాకారం

ఆయిల్‌పాం సాగుకు

సహకారం అందిస్తా

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): దళితులకు ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూముల్లో చేపట్టనున్న ఆయిల్‌పాం సాగుకు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని ముత్యంపేటకు చెందిన దళితులు మంగళవారం ఎమ్మెల్యే సత్యంను కలిసి కొండగట్టు సమీపంలో తమకు ప్రభుత్వం అందించిన సుమారు 30ఎకరాల భూముల్లో ఆయిల్‌పాం సాగు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తరుపున సహ కారం అందించాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సాగుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యుత్ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అయిల్‌పాం సాగుకు ముందుకు రావడంపై ఎమ్మెల్యే వారిని అభినందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మ్యాక లక్ష్మన్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్ తదితరులు ఉన్నారు.

మినీ స్టేడియం.. పాడి గేదెలకు నిలయం



మినీ స్టేడియంలో మేత మేస్తున్న గేదెలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో రక్షణ కరవైంది. మైదానంతో పాటు కళాశాల ఆవరణ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కళాశాల ఆవరణలో రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్ కేటాయించిన రూ. కోటి నిధులతో మినీ స్టేడియం నిర్మాణం పనులను చేపట్టారు. మొక్కలు, పచ్చని గడ్డి, క్రికెట్ ఆడేందుకు సీసీ, గోడలకు క్రీడాకారుల చిత్రపటాలతో తీర్చిదిద్దారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాడి గేదెలకు నిలయంగా మారింది. నిత్యం పాడి గేదెల మంద చేరుకుని గడ్డిని మేస్తున్నాయి. కళాశాల ఆవరణలో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రహరీని నిర్మించడంతో పాటు మినీస్టేడియం పనులను వేగవంతం చేసి వినియోగంలోకి తీసుకు రావాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు భద్రత నియమాలతో

ప్రమాదాలు దూరం

- ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు, పాల్గొన్న డ్రైవర్లు

భగత్‌నగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగవని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు అన్నారు. కరీంనగర్ బస్‌స్టేషన్ ప్రాంగణంలో మంగళవారం ప్రమాదాల నివారణకై రీజియన్ పరిధిలోని 11 డిపోల డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ రీజినల్ మేనేజర్ రాజు మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లే ప్రమాదాలు సంభవిస్తాయని వాటిని నివారించేందకు డ్రైవర్లు భద్రతా నియమాలను పాటిస్తు డ్రైవింగ్ చేయాలన్నారు. ఏకాగ్రతతో డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. మద్యపానం, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండి ప్రమాదాలను నివారించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్ (మెకానికల్) సత్యనారాయణ, డిప్యూటి రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, పలువురు అద్దె బస్సు డ్రైవర్లు హాజరయ్యారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు

ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక



అశోక్



వంశీ

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడా కారులు ఎంపికయ్యారు. హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(హాయ్) ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభ చాటిన ఉమ్మడి జిల్లాకు చెందిన జెట్టిపల్లి అశోక్(రామడుగు), జైనుపరం వంశీ(గుల్లకోట)లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వడ్లూరి రాజేందర్, జిట్టబోయిన శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ శ్రీనివాస్, యూనిస్ పాష, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.

27న వికలాంగుల ఉద్యోగ మేళా

కరీంనగర్ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రాస్ రూట్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఈ నెల 27న కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో వికలాంగుల కోసం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె సబిత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మేళా ఉంటుందన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, గ్రాడ్యుయేట్, ఇతర విద్యార్హతలు కలిగిన 20-35 సంవత్సరాల్లోపు వయస్సు గలవారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 7032777493, 9281031017 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు డీబార్

గణేశ్‌నగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం ఆరుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. వివేకానంద డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, ఎస్ఆర్ఎం డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, శ్రీచైతన్య ఉమెన్స్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఇద్దరు, శివాని డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

యాసంగికి ఏడు తడులు

- నేటి నుంచి కాకతీయ కాలువకు ఎస్సారెస్పీ నీటి విడుదల
- 63.85 టీఎంసీలు కేటాయింపు



ఎస్సారెస్పీ కాలువ ద్వారా వెళ్తున్న నీరు(ఫైల్)

జగిత్యాల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి సీజన్‌కు ఈ నెల 25 నుంచి నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. కాకతీయ కాలువ ద్వారా ఏడు రోజులు జోన్ - 1కు 3,500 క్యూసెక్కులు, ఎనిమిది రోజులు జోన్ - 2కు 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. యాసంగి సీజన్‌కు నీరు సమృద్ధిగా అందనుండడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. మూడు న్నర లక్షల ఎకరాలకు పైగా సాగు నీరు అందనుంది.

ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు

ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వచ్చింది. ప్రస్తుత సీజన్‌లో జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 282.317 టీఎంసీల నీరు వచ్చింది. అందులో నుంచి వరద గేట్లను ఎత్తడం ద్వారా గోదావరిలోకి, కాకతీయ కాలువ, లక్ష్మీ కాలువ, వరద కాలువ, అలీసాగర్ ఎత్తిపోతలు, గుత్ప ఎత్తిపోతలు, మిషన్ భగీరథ, ఎస్కేప్ ద్వారా 209.509 టీఎంసీల నీరును వదిలారు. ప్రస్తుతం డ్యామ్‌లో 80.053 టీఎంసీల నీరు ఉంది. జగిత్యాల జిల్లాలో యాసంగి సీజన్‌లో సుమారు 3.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారన్న అంచనా ఉంది. ఇందులో ప్రధానంగా వరి పంటను సాగు చేయనున్నారు.

వారబంధీ పద్ధతిలో నీటి విడుదల

వారబంధీ (ఆన్ అండ్ ఆఫ్) పద్ధతిలో ఎస్సారెస్పీ నీటి విడుదల జరగనుంది. ఎని మిది రోజుల పాటు ఆన్, 7 రోజుల పాటు ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేయడానికి అధికారులు కసరత్తు చేశారు. ఏడు తడులుగా నీటి విడుదల చేయనున్నారు. కాకతీయ కాలువ ద్వారా డీ - 5 నుంచి డీ - 53 కాలువకు ఏడు రోజులు, డీ - 53 నుంచి డీ 94 వరకు కాలువలకు ఎనిమిది రోజులు 500 క్యూసెక్కుల నీటిని వదలనున్నారు. అంతే గాకుండా కాకతీయ కాలువ ఆధారంగా పంపుసెట్‌లు అమర్చుకున్న రైతులకు నీరు అందించేందుకు ప్రతిరోజు 500 క్యూసెక్కుల నీటిని కేటాయించారు. మిగితా కాలువల ద్వారా నిరంతరం నీటి విడుదల జరుగుతుంది. డిసెంబర్ 25వ తేదీ నుంచి 2025 ఏప్రిల్ 3వ తేదీ వరకు నీటిని విడుదల చేయనున్నారు. ఎస్సారెస్పీ కాకతీయ కాలువ ద్వారా నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో కొన్ని ప్రాంతాలకు సాగునీరు అందుతోంది.

జగిత్యాల జిల్లాలో...

ఇబ్రహీంపట్నం మండలం నుంచి పెగడపల్లి మండలం వరకు సుమారు 91 కిలో మీటర్ల మేర కాకతీయ కాలువ ప్రవహిస్తుంది. ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు విడుదల చేస్తున్న నీరు 25వ కిలో మీటరు వద్ద జగిత్యాల జిల్లాలో ప్రవహిస్తుంది. 116వ కిలోమీటరు వద్ద ముగుస్తుంది. జిల్లాలోని వివిధ గ్రామాలకు కాకతీయ కాలువకు అనుబంధంగా ఉప కాలువలను నిర్మించి నీరు సరాఫరా చేస్తున్నారు. జిల్లాలో డీ - 21 ఉప కాలువ నుంచి డీ 83ఏ వరకు దాదాపుగా 62 డిస్ట్రిబ్యూటర్ కాలువలు ఉన్నాయి. ఒక్కో డిస్ట్రిబ్యూటరీకి ఆయకట్టును బట్టి ఎడమ, కుడి వైపులకు మరో 50 వరకు కాలువలు ఉంటాయి. సంబంధిత మైనర్ కాలువల ద్వారా సాగునీరు పంట పొలాలకు అందించాల్సి ఉంటుంది. జిల్లాలో దాదాపుగా ఎస్సారెస్పీ ద్వారా 1.70 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. డిస్ట్రిబ్యూటరీలకు సమీపంలో ఉండే చెరువులు, కుంటలు నింపేందుకు తూములు ఏర్పాటు చేయడం వల్ల సుమారు మరో లక్ష ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

సోలార్ పవర్ ప్లాంట్ ఎదుట రైతుల ఆందోళన

- కాలువను కబ్జా చేశారని ధర్నా



పవర్‌ప్లాంట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

మంథని, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు సాగు నీరందించే ఎస్ఆర్ఎస్పీ కెనాల్‌ను కబ్జాచేయడంపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని పోతారం గ్రామానికి చెందిన రైతులు గ్రామ శివారులోని సోలార్ పవర్ ప్లాంట్ ఎదుట మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. పోతారం గ్రామానికి చెందిన బుద్దార్తి సంజీవ్ అనే రైతు పురుగుల మందు డబ్బాతో ఆందోళన వచ్చి అగ్రహం వ్యక్తం చేయగా, రైతులు, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పవర్ ప్లాంట్ వద్ద రైతుల ఆందోళనలో కొద్దిసేపు ఉద్రికత్త పరిస్థితి ఏర్పడింది. పవర్ ప్లాంట్ పరిధిలో ఉన్న ఎల్-6 సబ్ కెనాల్‌ను పూడ్చి చిన్న పైప్‌లైన్‌ను అండర్‌గ్రౌండ్‌లో వేయడంతో దిగువ ఉన్న తమ పంట పొలాలకు సాగునీరందక పంటలు ఎండిపోయి ఆర్థికంగా నష్టపోతున్నామని ఆరోపించారు. గత 8ఏళ్ళుగా ఇదే పరిస్థితి కొనసాగుతండటంతో హైకోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికి పవర్ ప్లాంట్ యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతుల ఆందోళనతో అక్కడి చేరుకున్న ఏఎస్ఐ మల్లయ్య ఫోన్‌చేసి ఎస్ఆర్ఎస్పీ డీఈ మల్లయ్యకు పరిస్థితి వివరించడంతో హైకోర్టు తీర్పు మేరకు తాము ఈ విషయంలో నోటీసులు ఇచ్చామన్నారు. పోలీసుల జోక్యంతో ఆందోళన చేస్తున్న రైతులకు వద్దకు పవర్‌ప్లాంట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ వచ్చి హైకోర్టు తీర్పు మేరకు 20 రోజుల్లో కెనాల్‌ను పురుద్ధరించి రైతుల పంట పొలాలకు సాగునీరందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

న్యూస్ బాక్స్

ప్రజల దృష్టి మరల్చడానికి ప్రభుత్వ యత్నం

ఇల్లంతకుంట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల దృష్టి మరల్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీజేపీ మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయడంలో విఫలం చెందిన ప్రభుత్వం అనవసర విషయాలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అన్నివర్గాల ప్రజల్లో కాంగ్రెస్ పాలనపట్ల అసంతృప్తి రోజురోజుకు పెరుగుతోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీలను అమలు చేయాలని కోరారు.

'భూమిని ఇప్పించండి'

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామంలో తమ కుటుంబానికి చెందిన భూములను ఇప్పించాలంటూ సీనియర్ జర్నలిస్ట్ పొన్నాల గౌరీశంకర్ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను మంగళవారం కలిసి విన్నవించి వినతిపత్రం అందించారు. గ్రామంలోని తమ తల్లిదండ్రులకు ఉన్న భూమిని పొన్నాల గౌరీశంకర్, కృష్ణారావు, నర్సింహశాలుకు చెందాల్సిన భూముల హక్కులను తహసీల్దార్ కృష్ణారావుతో పాటు నర్సింహులు, ఉమమహేశ్వర్‌పై అక్రమంగా పట్టా చేసి తనకు అన్యాయం చేశాడని వివరించారు. తన తండ్రి పేరున ఉన్న ఇంటితో పాటు భూములను ముగ్గురికి సమానంగా పంపిణీ చేసి పట్టాలు అందించాలని తహసీల్దార్‌కు రెండుసార్లు వినతిపత్రం అందించానన్నారు. అయినా పట్టించుకోవడం లేదని జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని గౌరీ శంకర్ కోరారు.

జాతీయ బీసీ యువజన విభాగం గ్రామ అధ్యక్షుల నియామకం

కోనరావుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ యువజన విభాగం కోనరావుపేట మండల అధ్యక్షుడు ఎక్కల దేవి జలందర్ ఆధ్వర్యంలో మండలంలోని అన్నిగ్రామాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు వారికి నియామకపత్రాలను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ యువజన విభాగం జాతీయ కార్యదర్శి అమరగొండ అజయ్, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వంగ వంశీ కృష్ణ, మండల ఉపాధ్యక్షుడు అబ్బసాని సందీప్, నాయకులు అభిషేక్, సాయి, మధు, భూమేష్ పాల్గొన్నారు.

కాలగమనాన్ని మార్చిన క్రీస్తు జననం

- నేడు క్రిస్మస్ వేడుకలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

జిల్లాలో క్రిస్మస్ శోభ సంతరించుకుంది. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు మండలాల్లో ఉన్న చర్చిలను విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేశారు. క్రైస్తవులు క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. క్రిస్మస్ అనగానే క్రైస్తవుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. క్రిస్మస్ సందర్భంగా ప్రతి ఇంట్లో శాంతాక్లాజ్ బొమ్మలు, నక్షత్రాలు, క్రిస్మస్ చెట్లతో అలంకరించుకుంటారు. చర్చిల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక గీతాలను ఆలపిస్తారు. క్రీస్తు పలుకు వినబడగానే క్రైస్తవుల గుండెల నిండా ఆరాధన భావం వెల్లువెత్తుతుంది. బుధవారం క్రిస్మస్ వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి నుంచే జాగరణతో ప్రభువుకు స్వాగత వేడుకలు జిల్లాలోని వివిధ చర్చిల్లో కొనసాగాయి. ఏసుక్రీస్తు జన్మించిన రోజే క్రిస్మస్. ఏసు జననం ప్రపంచ గమనాన్నే మార్చిందని భావిస్తారు. క్రీస్తు పుట్టుకను ఆధారం చేసుకునే కాలాన్ని రెండుగా పరిగణిస్తున్నారు. అదే క్రీస్తు పూర్వం, క్రీస్తు శకంగా చెప్పుకోవడం. క్రీస్తు జన్మించి వేల సంవత్సరాలు గడిచిపోయినా దయామయుడిగా ప్రపంచమంతా ప్రార్థనలు చేస్తున్నారు.

● క్రిస్మస్ ట్రీ..

ప్రకృతిని ఆరాధించేలాగా క్రిస్మస్ పండుగ రూపుదిద్దుకుంది. 15వ శతాబ్దం నుంచి క్రిస్మస్ ట్రీ ఆచారం ఉంది. ఓకు చెట్టు కొమ్మలు తెచ్చి దానిని క్రిస్మస్ ట్రీగా అలంకరిస్తారు. చెట్టును ఆనందానికి, పచ్చదనానికి సిరి సంపదలకు చిహ్నంగా భావిస్తారు. క్రిస్మస్ చెట్టును ప్యారడైజ్ ట్రీగా వ్యవహరిస్తారు. విద్యుత్‌దీపాలతో అలంకరిస్తారు.

● శాంతాక్లాజ్ సందడి..

క్రిస్మస్ వేడుకల్లో అందరినీ ఆకర్షించేది శాంతాక్లాజ్. క్రిస్మస్ తాత. ఈ తాతనే ఫాదర్ నికోలస్ అని కూడా పిలుస్తారు. క్రిస్మస్ తాత సాంప్రదాయం మూడో శతాబ్దంలో మొదలైంది. డెన్మార్క్‌లో సేయింట్ నికోలస్ అనే ఒక భక్తిపరుడైన ఫాదర్ ఉదాంతమే శాంతాక్లాజ్ సృష్టికి మూలమని భావిస్తారు. నికోలస్ ఉన్న ప్రాంతంలో ఒక పేద రైతు ఉండేవాడు. తమ ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేయలేక అవస్థ పడుతుంటాడు. అది చూసిన నికోలస్ ఒక మూడు బంగారు నాణెంలను మూట కట్టి ఎవరికీ తెలియకుండా ఆ ఇంట్లో జారవిడుస్తాడు. ఆ



నాంపల్లిలో బాలయేసుకు ఏర్పాటు చేసిన పశువులపాక

రైతు కుటుంబంలో ఆనందం వెల్లివిరుస్తుంది. అందుకే చిన్నారుల్లో క్రిస్మస్ తాత బోలెడు బొమ్మలు, చాకెట్లు ఇస్తాడని సంబరపడతారు.

● క్రిస్మస్ స్టార్..

క్రిస్మస్ ప్రారంభం ముందు నుంచే క్రైస్తవులు తమ ఇళ్ల ముందు నక్షత్ర ఆకృతులను అలంకరించుకుంటారు. తూర్పు దేశాల వారు క్రీస్తు పుట్టుకకు చిహ్నంగా భావిస్తారు. క్రీస్తు రాకను కాంక్షిస్తూ చర్చిల్లో, ఇళ్లపై స్టార్‌లను అలంకరించడం కొనసాగుతుంది.

● కొవ్వొత్తుల వెలుగులు..

క్రిస్మస్ పండుగ సందర్భంగా కొవ్వొత్తుల ఆరాధన కూడా జరుపుతారు. దీనిని క్యాండిల్ లైట్‌గా పిలుస్తారు. డిసెంబరు 24 అర్ధరాత్రి వరకు జాగరణ రాత్రిని పాటిస్తారు. ప్రపంచం అంధకారంలో ఉందని, ఏసు ప్రభువు ఆ చీకటిని దూరం చేసేందుకు జన్మించాడని చాటేందుకు ప్రత్యేకంగా కొవ్వొత్తులను వెలిగిస్తారు. చర్చిలో కొవ్వొత్తులను వెలిగించి ఎనిమిది బైబిల్ సూక్తులు, తొమ్మిది పాటలను ఆలపిస్తారు. తేజోమయుడు ఈ లోకానికి వెలుగులు ఇవ్వడానికి వచ్చాడని భావిస్తారు.

● ముస్తాబైన చర్చిలు..

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతో పాటు దుమాల, గొల్లపల్లి, బొప్పాపూర్, నారాయణపూర్, రాజన్నపేట, తదితర గ్రామాల్లోని చర్చిలను రంగురంగుల విద్యుదీపాలతో అలంకరించారు. క్రైస్తవులు తమ ఇళ్ల ఎదుట నక్షత్రం గుర్తులు, కరెంటు దీపాలను ఏర్పాటు చేశారు. కొత్త దుస్తులను కొనుగోలు చేసి వేడుకలకు సిద్ధమవుతున్నారు. చర్చిల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పండుగ వేడుకల్లో మునిగిపోయారు. మండల కేంద్రంలో ఐపీసీ యంగ్ హోలీ టీం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ప్రదర్శన నిర్వహించారు. వీధుల గుండా శాంతాక్లాజ్ వేషధారణలతో పాటలు ఆలపించారు.



దుమాలలో విద్యుత్‌దీపాల వెలుగుల్లో చర్చి

వేములవాడ కల్చరల్: యేసక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంతో పాటుగా మండలంలోని చర్చీలలో క్రిస్మస్ వేడుకులకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. క్రైస్తవులు మగంళవారం నాంపల్లిలోని పునీత థామస్ చర్చి, బాలనాగర్, శాత్రాజుపల్లి, ఆరెపల్లి, రెడ్డిపురంలోని చర్చీలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఇంటిముందు, చర్చిలు, షాపుల ముందు క్రిస్‌మస్ చెట్లను ఏర్పాటు చేశారు.

● ఘనంగా ముందస్తు వేడుకలు

గంభీరావుపేట: మండలంలోని నర్మాల మానేరు హార్వెస్ట్ చర్చ్‌లో ప్రభుత్వ క్రిస్మస్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూపతి, మాజీ సర్పంచ్ రాజు, మాజీ ఎంపీటీసీ బాలమణి, హార్వెస్ట్ చర్చ్ పాస్టర్ రత్నాకర్, యెషియా, హిజ్కియా, సోనాదేవదాస్, యేసుదాస్ ఉన్నారు.

వీర్నపల్లి: మండలంలోని రంగంపేటలో గ్లోరియస్ గాస్పల్ చర్చ్‌లో పాస్టర్ టి నతనియేలు మాట్లాడుతూ యేసు క్రీస్తు ప్రభువు చూపిన మార్గంలో నడవాలని, ఒకరి పట్ల మరొకరు ప్రేమ, శాంతి, ఐక్యత కలిగి ఉండాలని తెలిపారు.

చందుర్తి: మండలంలోని మల్యాల గ్రామంలోని సాధన ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్లో కేకులు కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చేన్నమనేని రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు మమత, సోనీ, శోభ, ఆదిత్య, మానస, శిరీష, మానస, పాల్గొన్నారు.

కోనరావుపేట: ఆధ్యాత్మికతను పెంపొందించే విధంగా క్రిస్టమస్ వేడుకలను నిర్వహిస్తున్నారని నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని చర్చిలో క్రిస్టమస్ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయప్రకాశరావు, కాంగ్రెస్ మండల అధ్య క్షుడు ఫిరోజ్ పాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లింగయ్య, నాయిని ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.



మల్యాలలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



కోనరావుపేటలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించేలా చూడాలి



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తినే అహార పదార్థాల తయారీతోపాటు విక్రయించే కేంద్రాల్లో ఫుడ్‌సేఫ్టీ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డిని కలిసి జిల్లాలో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి పండుగల నేపథ్యంలో తయారు చేసే అహార పదార్థాల్లో కల్తీ లేకుండా చర్యలు తీసుకునే విధంగా చూడాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగల నేపథ్యంలో వినియోగదారులను అకర్షించడానికి బేకరీలు, రెస్టారెంట్‌లు, హోటల్స్ స్వీట్‌హౌజ్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారిటీ అఫ్ ఇండియా సూచనలకు భిన్నంగా మోతాదుకు మించి సింథటిక్‌ఫుడ్ కలర్స్, వివిధ రకాల ఫ్లైవర్స్ సాస్‌లు వాడుతున్నారన్నారు. దీంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్నల్‌దాస్ గణేష్ పాల్గొన్నారు.

బద్దం ఎల్లారెడ్డి వర్ధంతి పోస్టర్ల ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బద్దం ఎల్లారెడ్డి వర్ధంతిని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బద్దం ఎల్లారెడ్డి వర్ధంతి కరపత్రాన్ని సీపీఐ, ఏఐటీయూసీ పవర్‌లూం కార్మిక సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటలో బద్దం ఎల్లారెడ్డి పాత్ర కీలకమన్నారు. ఈ నెల 30న సిరిసిల్ల పట్టణ బీవైనగర్‌లో బద్దం ఎల్లారెడ్డి వర్ధంతిని పురష్కరించుకొని నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డి హాజరు అవుతున్నారన్నారు. సభకు సీపీఐ, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు నల్ల చంద్రమౌళి, గాజుల లింగం, నల్ల మార్కండేయులు, కూరపాటి లక్ష్మన్, అజ్జ వేణు, మంత్రి చంద్రయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి... ఒకరి మృతికి కారణమైన బాలుడి తల్లి రిమాండ్

రుద్రంగి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేగంగా ద్విచక్ర వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన బాలుడి తల్లిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో జరిగింది. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండలానికి చెందిన బాలుడు పనినిమిత్తం ఈ నెల 18న బయటకు వెళ్లాడు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో కంటే రాములు (72) అనే వృద్ధుడు మృతి చెందాడు. మృతుడు రాములు కుమారుడు కంటే నర్సయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ద్విచక్రవాహన రిజిస్ట్రేషన్ బాలుడి తల్లి పేరుపై ఉండడంతో ఆమెను అరెస్ట్ చేసి మంగళవారం జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులు, వాహన యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పట్టుబడిన మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన వారిపై ఏడు కేసులు నమోదు చేశామని డీఎస్పీ వివరించారు.

రాజన్నను దర్శించుకున్న నర్సంపేట ఎమ్మెల్యే



కోడె మొక్కును చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

వేములవాడ కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొని కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వదించగా ఆలయ సూపరింటెండెంట్ తిరుపతి రావు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట ఏఈవో అశోక్ ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి



రిలే నిరాహార దీక్షలో కరపత్రాలను చూపుతున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష విభాగంలో కాంట్రాక్టు పద్ధతిలో విధులను నిర్వర్తిస్తున్న ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరహార దీక్షలు మంగళవారంతో 15వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్ష శిబిరాన్ని టీపీటీఎఫ్ రాజన్న జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న జరిగే రాష్ట్ర ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకంగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అందరిని రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. పనిచేస్తున్న ఉద్యోగులందరికీ మినమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలన్నారు. సాధ్యమైనంత త్వరగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర ధర్నాకు సమగ్రశిక్ష ఉద్యోగులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్పపూల దేవేందర్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుమాల రాంనాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పార్వతి తిరుపతి, చకినాల రామచంద్రం, బండి ఉపేందర్, దూస సంతోష్, శ్రీరామోజు శ్రీనివాస్, సుల్తాన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి పెద్దపీట

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రాజెక్టుల నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రూరల్ మండలంలోని 43మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, ఎనిమిది లక్షల 75వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 10 కోట్లరూపాయల విలువైన, సహాయనిధి, ఎల్‌వోసీలు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన ఆరోగ్యం అందించడానికి డాక్టర్ల సంఖ్యను పెంచుతామని తెలిపారు. నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నామని వివరించారు. ఇప్పటికే మర్రిపల్లి రిజర్వాయర్, కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గత పాలకులు మన ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోలేదన్నారు. రాజన్న ఆలయం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంటే అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. త్వరలోనే నూతన



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఆది శ్రీనివాస్

రేషన్‌కార్డులను మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ రొండి రాజు, వైస్ చైర్మెన్ కనికరపు రాకేష్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాలకుర్తి పర్శరాములు, చెరుకు శంకరయ్య, మానుకోట పర్శరాములు, డీసీసీ ఉపాధ్యక్షుడు సంఘ స్వామి, పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, నాయకులు సోయినేని కరుణాకర్, నీరటి మల్లేశం, చిలుక పాల్గొన్నారు.

రైతులకు అనుగుణంగా సింగిల్ విండోల ఏర్పాటు



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతుల సంఖ్యకు అనుగుణంగా వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలు (సింగిల్ విండో)లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంబంధింత అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం కేంద్ర ప్రభుత్వ పథకం 'సహకార్ సే సమృద్ధి'పై జిల్లా కమిటీ సభ్యులతో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డు డీడీఎం దిలీప్ సహకార్‌సే సమృద్ధి పథకంపై అవగాహన కల్పించడంతో పాటు జిల్లాలో మొత్తం 24 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సింగిల్‌విండోల ఏర్పాటును రైతుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించి అన్ని సేవలు సింగిల్ విండోల్లో రైతులకు మరింత మెరుగ్గా అందించాలని అన్నారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి లత, పౌరసరఫరాల అధికారి వసంతలక్ష్మి, మేనేజర్ రజిత, జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, కేంద్ర సహకార బ్యాంక్ సీఈవో సత్యనారాయణరావు, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆగని దొంగతనాలు.. మోసాలు

- పెరిగిన శిక్షల శాతం

- 2024 క్రైం రేటును వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలు పెరిగాయి. రోడ్డు ప్రమాదాలు తగ్గలేదు. మరో వైపు నేరాలకు పాల్పడిన నిందితులకు శిక్షల శాతం పెరిగాయి. సీసీ కెమెరాల సహాయంతో పోలీసులు పలు కేసులను సవాల్‌గా తీసుకొని ఛేదించారు. ప్రశాంత వాతావరణంలో పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం 2024లో వార్షిక నేరాల వివరాలను ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ విలేకరులతో మాట్లాడారు.

● నేరాల అదుపునకు చర్యలు..

నేరాల అదుపునకు చర్యలు చేపట్టామని ఎస్పీ తెలిపారు. జిల్లాలో 2024లో 3,106కేసులు నమోదయ్యాయని, గత 2023లో 2969నేరాలు జరుగగా ఈ ఏడాది అదనంగా 137కేసులు పెరిగాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 428 ప్రాపర్టీ లాస్ కేసులు నమోదైతే ఇందులో 273కేసులు ఛేదించి 48.53లక్షలు రికవరీ చేశామని వెల్లడించారు. గతంలో కంటే 3.4శాతం ప్రాపర్టీ రికవరి ఎక్కువగా చేశామన్నారు. జిల్లాలో పలు హత్యకేసులను ఛేదించడ మే కాకుండా రౌడీయిజంపై ఉక్కుపాదం మోపామన్నా రు. జిల్లాలో 2023లో 12హత్యలు జరిగితే ఈ ఏడాది 13హత్యలు జరిగాయన్నారు. లోక్ అదాలత్ ద్వారా 987కేసులు, 1511 ఈ-పెట్టి కేసులు, 3233 ఎంవీ యాక్ట్ కేసులు పరిష్కా



వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

రం అయ్యాయని తెలిపారు. 2023లో క్లూస్ టీం ద్వారా 17 కేసులు ఛేదించగా ఈ ఏడాది 32కేసులు ఛేదించామన్నారు. గత ఏడాది 58కేసుల్లో శిక్షలు పడగా ఈ ఏడాది 77కేసుల్లో శిక్షలు పడ్డాయని, ఇందులో ముగ్గురికి జీవిత ఖైదు విధించారని ఎస్పీ తెలిపారు.

జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 428 దొంగతనాలు జరిగాయని, గత ఏడాది కంటే 101 దొంగతనాలు ఎక్కువగా జరిగాయని వివరించారు. జిల్లాలో 2023లో 218 రోడ్డు ప్రమాదాల్లో 74మంది మృతిచెందగా 2024లో 294 రోడ్డు ప్రమాదాల వల్ల 89మంది మృత్యువాత పడ్డారన్నారు. 2023లో 21 అత్యాచారాలు జరగగా కాగా ఈ ఏడాది 20 అత్యాచారాలు జరిగాయని, 2023లో 38 పోక్సో కేసు లు నమోదు కాగా ఈ ఏడాది 47 కేసులు నమోదయ్యాయని వివరిం చారు. 2023లో 329 చీటింగ్ కేసులు నమోదుకాగా ఈ ఏడాది 443కేసులు నమోదయ్యాయన్నారు. 2024లో 64 సైబర్ నేరాల జరుగగా 14కేసులు ఛేదించి మూడు కోట్లు రికవరి చేశా మన్నారు. 93 గంజాయి అక్రమ రవాణకేసుల్లో 211మంది స్మగ్లర్లను అరెస్ట్‌చేసి 41కిలోల 272గ్రాముల గంజాయిని సీజ్ చేయగా, గత ఏడాది 71.794కిలోల గంజాయిని సీజ్ చేశామని తెలిపారు.

దొంగలించబడిన, పోగొట్టుకున్న 812 మొబైల్ ఫోన్లలో 698 ఫోన్‌లు గుర్తించి బాధితులకు అందజేయడంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచామని ఎస్పీ చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 5,845 మంది మందుబాబులపై కేసులు పెట్టి 28.98 లక్షల జరిమానా విధించామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి 8,559 కేసులు నమోదుచేశామని, 1,56,878 ఈ-చాలన్స్ ద్వారా 3,78,14,985 రూపాయల జరిమానా వసూలు చేశామని వివరించారు.

● ప్రతిభ కనబరిచిన పోలీసులకు రివార్డులు

జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రతీనెలా రివార్డులు ఇచ్చి ప్రోత్సహించామన్నారు. మెగా హెల్త్‌క్యాంపులు , ఆపరేషన్ జ్వాల, బస్ భరోసా, పోలీస్ అక్క, జాబ్ మేళా, ఉపాధి శిక్షణ, డ్రైవింగ్ లైసెన్స్ మేళా, మీ కోసం, గ్రీవెన్స్ డే, మెస్సెజ్ యువర్స్ ఎస్పీ, రక్తదాన శిబిరాలు, స్పోర్ట్స్ మీట్, దోస్త్‌మీట్ తదితర వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళ్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ వివరించారు.

రెండేళ్లుగా నేరాలు, సంఘటన వివరాలు

వివరాలు	2023	2024
దోపిడీలు	12	12
ఇళ్లలో దొంగతనాలు	123	168
సాధారణ దొంగతనాలు	192	248
హత్యలు	12	13
అత్యాచారాలు	21	20
చీటింగ్	329	443
రౌడీషీట్‌లు	108	136
పీడీయాక్ట్	01	03
రోడ్డు ప్రమాదాలు	218	294
మృతులు	74	89